భజన పాటల్లోనే కాదు కళ్ళు పెట్టుకుని వెతికితే బుర్రకథల్లోనూ మర్డర్‌సాంగ్స్‌లో కూడా "పాప్ బీట్" దొరుకుతుంది.

"హరి హరీ నారాయో ఆది నారాయో

కరుణించి మమ్మేలూ

కమలలోశనుడా –" ఇది కూడా పాప్‌సాంగ్‌కి పనికొస్తుంది. భజన పాటా, పాత గ్రామఫోను రికార్డూ, బ్రహ్మంగారి తత్వం, రామదాసుకీర్తన, మంగళహారతీ కాదేదీ ఇల్లాలి ముచ్చట్ల కనర్హం. బోలో సుబహ్‌శామ్ హరేకృష్ణ హరేరామ్!

# అలివేణీ - తరవాణీ

పిల్లలకు చద్దెన్నాలు పెట్టడం 'ఫాషన్' కాదనుకునే తల్లులున్న రోజులివి. వెనకటి రోజుల్లో మహాతల్లులు చూసీచూడకుండా పిల్లలకు చద్దెన్నాలు కలిపి పెడుతూ ఒకటీ అరా ఆవకాయ, గోంగూర, ఉల్లిపాయ పచ్చడి ముద్దలు నోట్లో వేసుకునేవారు. పరమ పతివ్రతలైనా చద్దన్నాలు తినకుండా వుండలేకపోయేవారు. వెనక చుట్టాలింటికి ఏ వూరైనా వెళితే చద్దెన్నం తింటావా, కాఫీ తాగుతావా అని అడిగేవారు. ఇప్పుడా క్రొశ్న అడిగేవారు లేరు. బాత్రూములొచ్చి మగాళ్ళు కూడా నెకెడ్ బాతులారంభించాకా కాలవల్లో, చెరువుల్లో స్నానాలు అంతరించాయి. కాఫీ హోటళ్లలో టిఫిన్ల ఆరగింపులారంభమయాక చద్దన్నాలవుటాఫ్ ఫ్యాషనులయిపోయాయి. నన్నడిగితే మనప్రాచీన భోజన హిందూ సంస్కృతిలో చద్దెన్నాలకొకవిశిష్టమైనస్థానం వుందంటాను. పాత అలవాట్లు కొన్ని అంతరించిపోతున్నాయి. ఖరీదైన అలవాట్లు వచ్చి సమష్టి కుటుంబ జీవితపు జీవన విధానం మీద దెబ్బ తీశాయి. హోటళ్ళు కిల్లీ దుకాణాలు వెలిశాక 'ఇంటిదొంగ' లెక్కువయారు. మా ఊళ్ళో కుర్రాళ్ళు కొబ్బరికాయ లెత్తుకుపోయి కిల్లీ కొట్లో యిచ్చి సోడాలు బీడీలు తాగేవారు. కొబ్బరికాయలమ్మి టీకొట్లో దూరే వాళ్ళిప్పటికీ వున్నారు. వడ్లుపోసి అవీ ఇవీ కొనుక్కున్నట్లు కొబ్బరికాయ లిచ్చి కావలసినవి తీసుకోవడం ఇంకా వుంది. ఆడాళ్ళు కాపర్సుకరువై నప్పుడల్లా కొబ్బరికాయలతో స్మాల్ స్కేల్ బిజినెస్సులు నడిపేస్తారు. మని లేనంత మాత్రానా కోరికలు ఆగుతాయా?

కాలవలో స్నానంచేసి, ఆవకాయకు గేదేపెరుగుని జోడించి చద్దెన్నం, కొట్టేస్తే ఆమత్తులో ప్రపంచం మరోలా కనిపిస్తుంది. చద్దెన్నం ఫిలాసఫీ అని వుంది. అందులోంచి వచ్చిన సామెత "చద్దెన్నం తిన్నమ్మ మొగుడాకలెరుగదని" ఆ మాటనిజవే–మనం గోంగూర పచ్చడి చిక్కని మజ్జిగ వేసుకుని ఓ కంచం ఉదయ సూర్యుని సప్తహయాలూ పరిగెత్తే వేళ లాగిస్తే "ఆకలి సమస్య" అనేది ప్రపంచమంతటా తీరిపోయినట్టే వుంటుంది. నాకు అప్పగింతలప్పుడు మావాళ్ళు "అమ్మాయి చద్దెన్నం తినకుండావుండ లేదు." "నాలుగావకాయ పెచ్చులు వెయ్యొదినా" అంటూ

మా అమ్మ కంటతడి పెట్టుకుని అప్పజెప్పింది. నేను కాపురాని కెళ్ళిపోయాక మా అమ్మ నా చద్దెన్నం తినే జర్మన్ సిలవర్ కంచంకేసి చూసి బావురుమని ఏడ్చేసిందట. నేను చద్దెన్నం తినేశాక నాలుగు ఆవకాయ పెచ్చులు తీసుకెళ్ళి శుభ్రంగా కడిగి దాచుకొని తింటూ తొక్కుడు బిళ్ళ, గచ్చకాయలు చింతగింజలు ఆడుకునేదాన్ని. నాకు బొడ్లో ఎప్పుడూ ఓ కాగితంలో నిమ్మకాయ పెచ్చులో మాగాయ ముక్కలో వుండాల్సిందే – ఏవీ తోచకపోతే కొత్త చింతపండు ముద్ద దగ్గర పెట్టుకుని చప్పరించే దాన్ని. ఎండ బెట్టిన మాగాయ ముక్కలు చీకుతూ వుంటే – ఈ మొగుడెందుకు ఈ కాపరమెందుకు ఈ పిల్లలెందుకు ఇదంతా మాయ మిథ్య– ఈ మాగాయ ముక్క ఒక్కటే నిజం. ఇదే కూడా స్వర్గందాకా వచ్చేది. నీ భర్తప్రాణాలు తప్ప మరేదైనా వరం కోరుకో అన్నప్పుడు సావిత్రి చద్దెన్నం తినాలనుంది అని అడక్క రాజ్యాలిమ్మని పోయిన సంపద లిమ్మని అడిగింది. తెలివి తక్కువ పతివ్రత. రావాణాసురుడు కూడా పర్ణశాలకు వచ్చి సీతాదేవిని భిక్ష అడిగినప్పుడు ఆవిడ ఆవకాయ జాడీ అతనిచేతిలో పెట్టివుంటే అసలు సీతాపహరణం అనేది జరిగి వుండేదికాదు, సీతారామ లక్ష్మణులు పధ్నాలుగేళ్ళు అరణ్యవాసం చేసినపుడు ముగ్గురూ కలిసి ఆవకాయ నంజుకుని రోజూ చద్దెన్నం కొట్టేసి వుండేవారు. ఆ కారణంచేతే హా సీతా హా సీతా అని రాముడు ఏడ్చాడు – చద్దెన్నం ఎలా వస్తుంది సీతా అని వాపోయాడు.

నాకు చద్దెన్నంలో మాడిన పెచ్చు లిష్టం. మరీ బొగ్గులా మాడిపోకుండా దోరగా వేగిన పెచ్చుల్లో గోంగూర పచ్చడి మిళాయించి ఉల్లిపాయ కొరుక్కుంటే అబ్బ అడక్కండి. ధుమా వుంటుంది. తిండి విషయంలో తెలుగువాళ్ళ టేస్టుని అగౌరవపరచటాన్ని సహించలేను. చద్దెన్నాల ప్రస్తావన వచ్చినపుడు తరవాణి గురించి చెప్పకపోవటం చాలా పెద్ద అపరాధం. తరవాణికి, ఆవకాయకు వుండేటటువంటి సంబంధం జీవాత్మ పరమాత్మ సంబంధంలాటిది, ఒక గ్లాసుడు తరవాణి పుచ్చుకుంటే చల్లగానేకాక మత్తుగా, మజాగా ధుమాగా వుంటుంది. తరవాణీలో పడేసిన అన్నం కరుడు ముట్టుంటే పువ్వులా విడిపోయి లోపలికి వెళ్ళగానే సిస్టం అంతా కూలయిపోతుంది.

ఇప్పుడు తరవాణి కుండలు ఏ ఇంట్లోనూ కనపడటంలేదు. ఆంధ్ర సంస్కృతికి అమూల్యమైన అలంకార మనదగిన తరవాణీ కుండలేని వంటిల్లు వంటిల్లేగాదు. కాని చద్దెన్నాల యుగం అంతరించటంతో తరవాణి కుండల యుగం కూడా అంతరించిందనే చెప్పాలి.

చిరుచేదు పానీయాల కోసం ఎగబడే వారందరూ తెలుసుకొనవలసిన పరమ రహస్యం తరవాణీ కూడా కిక్కిస్తుందని. బీరులాగా తరవాణీ కూడా వేద కాలం నుంచీ వస్తున్న ఫుడ్ డ్రింకే తీయగా పుల్లగా కొండొకచో చిరుచేదుగా మత్తుగా చల్లగా వుండే తరవాణీని పునరుద్ధరించిన నాడు వడగాడ్పులకు ఆబాల గోపాలమూ తట్టుకుని నిలబడ కలుగుతారు.

ఒక ఇంట్లో తరవాణీ కుండ వుంటే అందు లోంచి కొంత బారో చేసి ఎన్ని కుండలయినా (ఒక దీపంతో మరో దీపాన్ని వెలిగించినట్లు) నెలకొల్పవచ్చును. జఠరాగ్నిని చల్లార్చటానికి తరవాణీలో అన్నంకంటె మించిన వస్తువు లేదు. దేవదానవులు అమృతం కోసం కాట్లాడుకున్నా రంటారు. బహుశా అది తరవాణీ తప్ప మరోటి కావడానికి వీల్లేదు. ఎన్నికల సంఘం వారు

అభ్యర్థులకు కేటాయించిన గుర్తులలో 'తరవాణీ కుండ' కూడా వుంది. దాన్ని వారు కడవ అన్నారుకాని అది తరవాణీ కుండే- వాణిశ్రీకి తరవాణిశ్రీకి పడదు. తరవాణీ కొట్టేస్తే చిన్నప్పుడు స్కూల్లో నిద్దరొచ్చేది. తరవాణీలో వూరేసిన మాగాయటెంక చీకుతూ ఈ వ్యాసం చదవండి మీకు తెలుస్తుంది. నేనెప్పుడూ తల దగ్గర దిండు కింద ఒక కాగితం పొట్లంలో రెండు ఆవకాయ పెచ్చులూ, మాగాయ ముక్కలూ, నిమ్మబద్దలూ, కొత్త చింతపండూ పెట్టుకుని నిద్దరోయేదాన్ని. మా అత్తారింట్లో నాయీ చిరుతిళ్ళు చూసి "దిగర్ల్ యీజ్ కేరీయంగ్" అని అంతా అనుకోవడం ప్రారంభించారు.

ఆపిల్ పళ్ళు తిను, దానిమ్మపళ్ళు తిను, అర్టిపళ్ళు తిను, అనాసపళ్ళుతిను, నారింజపళ్ళుతిను, కమలాలుతిను, సీతాఫలాలు తిను, రామాఫలాలు తిను, ద్రాక్షపళ్ళు తిను, అలూబకరా పళ్ళు తిను, లీచీపళ్ళు తిను, కిస్‌మిస్‌పళ్ళు తిను, అంతేకాని – ఈ ఆవకాయ పెచ్చులూ మాగాయ టెంకలూ తెచ్చుకుని మంచం మీద తలకింద పెట్టుకుతినడం మానేయ్ అని మావారు గొడవ చేశారు. మన సంస్కృతి గురించి ఏమీ తెలియనందుకు మావారి అజ్ఞానాన్ని క్షమిస్తూ అప్పట్నుంచీ వారు చూస్తూండగా తింటం మానేశాను. కాని నోరు మాగాయటెంక వాసనేస్తూందే అనటం మావారు మానలేదు – నేను నవ్వేసి క్షమించి పారేస్తూ వుంటాను. ఒకే మామిడిపండుని భార్యాభర్తలు ఆరగించటం ఎలా అనే విషయాన్ని గురించి వచ్చేవారం చెబుతాను.

# పాలిచ్చే తల్లి

మొన్న బస్సులో వూరెళ్ళినప్పుడు ఒక పల్లెటూరి అమ్మాయి అంతమందిలో నిర్భయంగా పవిట పక్కకు లాగి రవిక సర్ది పిల్లాడిని అడ్డం వేసుకుని పాలిస్తోంది. పైగా ఏటో ఆలోచిస్తూ పరధ్యాసగా వుంది. ఆ పిల్లడు కూడా ఒక చేత్తో తల్లితో ఆడుకుంటున్నాడు. నాకు ఒళ్ళు కంపరమెత్తింది. అంతమందిలో అలా సిగ్గు లేకుండా పాలిచ్చే తల్లిని స్త్రీజాతికే అవమానంగా భావించి మా వారు అటు చూస్తున్నారేమోనని ఆయనకేసి తిరిగాను, ఆయన అటే చూస్తూ చిరునవ్వు నవ్వుతున్నారు. "ఎందుకు నవ్వుతున్నారు, ఆ సిగ్గులేని ఆడదాన్ని చూసి" అన్నాను కొంచెం మూతి బిగించి.

"లోకోత్తరమైన దృశ్యాన్ని చూసి ఆనందిస్తున్నాను" అన్నారు ఏవీ సిగ్గులేకుండా – ఇలాటి సిగ్గులేని మొగుడితో ప్రయాణం చేస్తున్నానే అని నాకు తలబద్దలు కొట్టుకోవాలనిపించింది. లేచి వెళ్ళి ఆపల్లెటూరి మొద్దుచెంపలు ఎడా పెడా వాయించాలనుకున్నాను. చాలామంది అటే చూస్తూన్నారు – చూసీ చూడనట్లు. ఎంత బరి తెగించింది? "కొంగు మీదకు లాక్కుని అటు